కలెక్టరేట్ ఎదుట కాంగ్రెస్ ధర్నా

విశాలాంధ్ర - అమలాపురం : కాంగ్రెస్ యువ నేత రాహుల్ గాంధీపై జరిగిన తప్పుడు కేసు శిక్షకు నిరసనగా శుక్రవారం పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్ర రాజు పిలుపు మేరకు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు కామన ప్రభాకరరావు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. హిందూపూర్‌లో రాహుల్ గాంధీ మీద బీజేపీ నేతలు కుట్ర పన్ని, 2019లో రాహుల్ గాంధీ, ఎన్నికల ప్రచారంలో తప్పు మాట్లాడాడని, రాహుల్ గాంధీ రాజకీయ ఎదుగుదల చూసి ఓర్వలేక సూరత్ కోర్టులో, 2 సంవత్సరాల కారాగార శిక్ష వేశారని తెలిపారు. ఇందుకు నిరసనగా శుక్రవారం అమలాపురంలో గడియార స్తంభం వద్ద మహాత్మ గాంధీ విగ్రహానికి పూల మాల వేసి అనంతరం కలెక్టర్ ఆఫీసు వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు కామన ప్రభాకరరావు మాట్లాడుతూ బీజేపీ అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండ గడుతూ, బీజేపీ నేతలు ఎన్ని కేసులు పెట్టినా, భయపెట్టిన, బెదిరించినా దాడులు చేసినా, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు భయపడరని అన్నారు. ఈకార్యక్రమంలో నియోజక వర్గ ఇంచార్జి అయితా బత్తుల సుభాషిణి, పట్టణ అధ్యక్షుడు వంటెద్దు బాబి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధికలో పాల్గొన్నారు.

క్షయపట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - ఆలమూరు : క్షయ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి తగు జాగ్రత్తలు పాటించాలని కొత్తపేట నియోజక వర్గం ఆలమూరు మండల వైకాపా కన్వీనర్ తమ్మన శ్రీనివాసు అన్నారు. ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా మండల పరిధి చెముడులంకలో క్షయ వ్యాధి పట్ల గ్రామ వీధుల్లో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మార్చి 24వ తేదీన ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రతిరోజు దేశవ్యాప్తంగా అనేక మంది క్షయ వ్యాధితో మరణిస్తున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించిందని, భారత ప్రభుత్వం 1962ను క్షయవ్యాధి నివారణకు ప్రత్యేకమైన చర్యలను తీసుకోవడం ప్రారంభించిందని ఆయన అన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీగా వెళ్లి క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి యు రేణుక, నాయకులు దొండపాటి చంటి, మోటూరి సురేష్, పలువురు ఏఎన్ఎంలు, ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

సంపూర్ణ బహిరంగ మల విసర్జన నివారణలో చెముడులంక భేష్

విశాలాంధ్ర - ఆలమూరు : కొత్తపేట నియోజకవర్గం ఆలమూరు మండలం చెముడులంక గ్రామంలో సంపూర్ణ బహిరంగ మల విసర్జన నివారణ కార్యక్రమం పకడ్బందీగా నిర్వహిస్తున్న తీరు పలు గ్రామాలకు ఆదర్శంగా ఉందని కేంద్ర ఓడిఎఫ్ బృంద సభ్యులు జి. సురేంద్ర, బి.రమణలు సర్పంచ్ తమన శ్రీనివాసును, పంచాయతీ కార్యదర్శి యు. రేణుకను అభినందించారు. చెముడులంక గ్రామంలో వారు శుక్రవారం అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, నివాస గృహాలలో గల మరుగుదొడ్లను పరిశీలించారు. గతంలో బహిరంగ మలవిసర్జన చేసే ప్రాంతాలను పరిశీలించారు. గతానికి భిన్నంగా సంపూర్ణ బహిరంగ మల విసర్జన నివారణ గ్రామంగా పూర్తిగా మార్చిన సర్పంచును, కార్యదర్శులను వారు అభినందించారు. ఈ గ్రామంలో 954 గృహాలకు గాను 1511కుటుంబాలు నివాసాలు ఉంటున్నారని, ప్రతి గృహానికి సరిపడే మరుగుదొడ్లు కేంద్ర ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయని గుర్తించారు. వీరి వెంట గ్రామ సర్పంచ్ తమ్మన శ్రీనివాసు, పంచాయతీ కార్యదర్శి యు. రేణుక, సిబ్బంది ఎస్. సూరిబాబు, మాజీ సర్పంచ్ బి. వీర వెంకట్రావు, దొండపాటి చంటి, మోటూరి సురేష్ పలువురు పాల్గొన్నారు.

ఫ్లోర్ మిల్లులో అక్రమంగా పీడీఎస్ బియ్యం

విశాలాంధ్ర - కపిలేశ్వరపురం : అంబేద్కర్ కోనసీమ జిల్లా మండల పరిధి కోరుమిల్లిలోని శ్రీవైష్ణవి ఫ్లోర్‌మిల్లుపై విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించారు. మిల్లులో అక్రమంగా ఉంచిన 1,620 కేజీల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. రాజమహేంద్రవరం విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఎస్పీ పి.రవికుమార్ ఉత్తర్వులపై సీఐ వై.సత్యకిశోర్, తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంఎస్ఓ టి. సుబ్బరాజు మిల్లుపై దాడి చేశారు. 31 సంచుల్లో అక్రమంగా ఉంచిన 1,620 కిలోల బియ్యాన్ని పట్టుకున్నారు. కేసు నమోదు చేసి, బియ్యాన్ని స్వాధీనపర్చుకున్నారు. వీఆర్వో సత్య సుబ్బలక్ష్మి, మహిళా పోలీస్ పి రామతులసి పాల్గొన్నారు.

పాల వ్యాన్ బోల్తా

విశాలాంధ్ర - ముమ్మిడివరం : ముమ్మిడివరం మండలం కర్రివాని రేవు గ్రామం సమీపంలో పిడబ్ల్యుడి ఏటి గట్టుపై శుక్రవారం తెల్లవారు జామున ట్రాక్టర్‌ను తప్పించబోయి 11 కెవి విద్యుత్ స్తంభాన్ని పాల వ్యాను ఢీ కొట్టింది. విద్యుత్తు వైరు ముందుగా తెగి పడిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. పల్లంకుర్రు వైపు నుండి మురమళ్ళ వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది.

మండలంలో అభివృద్ధి పనులపై సమీక్ష

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండల కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో, వెల్ఫేర్ అసిస్టెంట్‌లతో, ఎఎన్‌యంలతో, ఐసిడిఎస్ సూపర్ వైజర్లతో ఎంపీడీఓ నాతి బుజ్జి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపిడిఓ నాతి బుజ్జి మాట్లాడుతూ ఎఎన్‌యంలు పాఠశాలలను సందర్శించినపుడు పాఠశాలలోని విద్యార్థులకు హెచ్‌బి రక్త పరీక్ష నూరు శాతం పూర్తి చేయాలని, పూర్తి చేసిన వివరములు సంబందిత యాప్ నందు నమోదు చేసి, ఎవరైతే బలహీనంగా ఉన్నారో వారికి సరైన పౌష్టికాహారం తీసుకునేలా ప్రేరణ కల్పించాలని తెలియజేసారు. గర్భవతులకు వైద్య పరీక్షలను నూరు శాతం నిర్వహించాలని ఎఎన్‌యంలను ఆదేశించారు. బడిబయట ఉన్న పిల్లలను గుర్తించి నాన్ రెసిడెన్షియల్ స్కూల్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేసి, వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించడానికి ఉపాధ్యాయులను నియమించారని తెలియజేసారు. ఈ సమావేశంలో మండల విద్యాశాఖాధికారి పి.వర ప్రసాదరావు, పరిపాలనాధికారి టివి సురేంద్ర రెడ్డి, ఐసిడిఎస్ సూపర్ వైజర్, ఇన్‌చార్జి ఈఓఆర్డీ చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దస్తావేజులు పోయినవి

కముజు రాంబాబు, తండ్రి సత్యనారాయణ కాట్రేనికోన వాస్తవ్యుడనైన నేను యావన్మందికి తెలియజేయునది ఏమనగా, కాట్రేనికోన మండలం, కాట్రేనికోన గ్రామంలో నాకు చెందిన జిరాయితీ పల్లం భూమి దస్తావేజులు నెం.338/2001, ది. 09-03-2023వ తేదీన కాట్రేనికోన నుండి చెయ్యేరు వెళ్తుండగా బ్యాగ్‌తో సహా దారిలో పడిపోయినవి. దయచేసి దొరికిన వారు ఈ క్రింది ఫోన్ నెంబరుకు తెలియజేయవలసినదిగా కోరుతున్నాను.

కముజు రాంబాబు, కాట్రేనికోన
సెల్ : 9573239669

CHANGE OF NAME

I, MUPPIDI DHANA RAJU (New Name), S/o, SATYANARAYANA Previously Called MUPPIDI DANAYYA (Old Name), Resident of F.No.581, Indiramma Colony, Chagallu Village and Mandal, East Godavari District-534342, Andhra Pradesh. Now Changed my Name from MUPPIDI DANAYYA (Old Name) to MUPPIDI DHANA RAJU (New Name). Today onwards Use my New Name for all further Transactions.

పారిశుద్ధ్య కార్మికులపై కక్ష సాధింపు మానుకోవాలి

విశాలాంధ్ర - కాకినాడ : ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధ సంఘం కాకినాడ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం కాకినాడలో స్థానిక జగన్నాథపురం 5 సర్కిల్‌లో హాజరు కార్యాలయం వద్ద మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులపై వ్యక్తిగత కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని, సచివాలయ సెక్రెటరీ రాజును సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. ధర్నాకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ మాట్లాడుతూ సచివాలయ సెక్రెటరీ రాజు అహంభావంతో మున్సిపల్ కార్మికుల పట్ల చులకన భావంతో ప్రవర్తిస్తున్నారని అన్నారు. కనీసం వారిని గౌరవంగా పిలవకుండా, అవహేళనతో మాట్లాడుతున్నారని, తనకు ఎదురు చెప్పిన వారిపై ఫిర్యాదులు చేసి వారిని ఉద్యోగం నుంచి తొలగిస్తానని కార్మికులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, అన్నారు. అందులో భాగంగానే బండి అప్పన్న అనే కార్మికులపై వ్యక్తిగత కక్ష సాధింపు చర్యల్లో చేపట్టే విధంగా విధి విధానాలు ఉన్నాయని, ఇలాంటి సంఘటనలు కాకినాడ మున్సిపల్ నగరపాలక సంస్థలో ఎన్నడూ జరగలేదని, ఇది కేవలం సచివాలయ సెక్రటరీలు వల్ల మాత్రమే జరుగుతున్నాయని అన్నారు. ఆరో సర్కిల్లో కూడా ఇదేవిధంగా సెక్రటరీలు వ్యక్తిగత కక్ష సాధింపు చర్యలు చేపడుతున్నారని, బండి అప్పన్నను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని, సచివాలయ సెక్రటరీలు మున్సిపల్ కార్మికులను గౌరవించకపోయినా, మహిళల పట్ల అమర్యాదగా ప్రవర్తించినా, వ్యక్తిగత కక్ష సాధింపు చర్యలు చేపట్టినా కాకినాడలో అన్ని సర్కిల్‌లో ఉన్న మున్సిపల్ కార్మికులు పనులు నిలుపుదల చేసి న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని ప్రసాద్ అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ప్రాణం తీస్తున్న గుండెపోటు

కుప్పకూలుతున్న జనాలు

విశాలాంధ్ర - అమలాపురం : ఇటీవల తెలుగు రాష్ట్రాల్లో కరోనాను మించిన ఘోరాలు జరుగుతున్నాయి. మనుషుల ప్రాణాలు వరసగా పిట్టల్లా రాలిపోతున్నాయి. రెప్పపాటు కాలంలో గుండెపోటుతో మరణిస్తున్న వారి సంఖ్య గణనీయంగా పెరిగిపోతోంది. పట్టుమని పాతి కేళ్ళు కూడా నిండని యువతనుండి యాభై ఏళ్ళ వరకూ హఠాత్తుగా గుండెపోటుతో కుప్పకూలి పోతున్నారు. కారణాలు ఏవైనా ఇలా వరుస గుండెపోటు మరణాలు ప్రజల్లో భయాందోళన కలిగిస్తున్నాయి. ఓ వైపు కరోనా మళ్లీ మొదలైందని ప్రచారం జోరందుకుంది. గతంలో ప్రజలకు వేసిన కరోనా వ్యాక్సిన్ పనితీరుపై పలువురు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. వరుసగా గుండెపోటు మరణాలతో ప్రజలు క్షణక్షణం భయంతో వణికిపోతున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ప్రతిరోజు ఎక్కడో అక్కడ హార్ట్ ఎటాక్‌తో కన్నుమూస్తున్నారు. అమలాపురం హైస్కూల్‌లో పిల్లలకు పాఠాలు చెబుతున్న 30 ఏళ్ల మాస్టర్ హఠాత్తుగా కుప్పకూలిపోయి ప్రాణాలు వదిలేశారు. బండి మీద వెళుతున్న యువకుడు వెళుతూనే ప్రాణం పోయింది. కూలి పని చేస్తున్న శ్రామికుడు చేనులోనే గుండెపోటుతో చని పోయాడు. ఇలా ఒకటా రెండా ఇప్పుడు చూసిన మనిషి అరగంట తర్వాత బ్రతికి వుంటాడన్న నమ్మకం లేక ప్రజలు వణికిపోతున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో జరుగుతున్న ఈ దారుణ మరణాలపై ప్రజలు హడలిపోతున్నారు. ఇంటి నుండి బయటకు వెళ్లిన వారు మళ్ళీ ఇంటికి వస్తారన్న నమ్మకం లేక భయపడి పోతున్నారు. చిన్నా పెద్దా అన్న తేడా, అడా మగా అన్న భేదం లేకుండా విగత జీవులు అవుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరిగిపోతోంది. కొందరైతే కరోనా మరో రూపంలో ఉగ్ర రూపం దాల్చి మనుషులను మింగేస్తోందని, కొందరు అంటుంటే మరో వేరియంట్‌లో విజృంభిస్తోందని డైరెక్టుగా హార్ట్ ఎటాక్ వచ్చేస్తోందని రకరకాలుగా పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ముఖ్యంగా కిడ్నీ, లివర్, ఊపిరితిత్తులు, గుండె జబ్బులు వంటి ప్రాణాంతక వ్యాధులు అయితే ఇటీవలి కాలంలో పెరిగిపోయి ప్రాణాలు హరిస్తున్నాయి. వైద్య నిపుణులు నుండి ఇంకా ఎలాంటి ప్రకటన రాకున్నా జరగాల్సిన దారుణాలు జరిగిపోతూనే ఉన్నాయి ప్రభుత్వాలు వెంటనే స్పందించి హఠాత్తుగా సంభవిస్తున్న మరణాలు నివారించాలని ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

ముస్లింల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

విశాలాంధ్ర - కాకినాడ రూరల్ : ముస్లింల అభివృద్ధి వైసీపీ అభివృద్ధిగా భావించి ముస్లింల కోసం అహర్నిశలు కృషి చేస్తున్న వ్యక్తి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అని వక్ఫ్ బోర్డ్ సెక్రెటరీ కరీంభాష పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఇంద్రపాలెం గ్రామంలో లిటిల్ బర్డ్ స్కూల్ సమీపంలో ఉన్న మసీదులో ఇటీవల ఉమ్రాయాత్రకు వెళ్లి వచ్చిన ముస్లిం పెద్దలను పూలమాల, సాల్వాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కరీం భాషా, పెద్దలు మాట్లాడుతూ ముస్లింలకు రంజాన్ మాసం చాలా పవిత్రమైనదని ఈ మాసంలోనే సర్వ లోకాల సృష్టికర్త అల్లాహ్ ఆజ్ఞలు, ప్రవక్త మహమ్మద్ పై అవతరించబడిన పవిత్ర గ్రంథము ఖురాన్. ఈ రంజాన్ మాసంలో క్రోధము, కోపము, అసూయ, మోసము, మొదలగు చెడు గుణములను విడిచిపెట్టి రాత్రింబవళ్లు ఆరాధన, ఖురాన్ పఠణము, దాన ధర్మములు వంటి సత్కార్యములతో కాలం గడపాలన్నారు. ముందుగా ప్రభుత్వం నూతనంగా నియమించిన వక్ఫ్ బోర్డ్ సెక్రటరీ కరీం బాషాను మసీదు కమిటీ ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమంలో ఇమామ్ ఎండి షహబాజ్, ప్రెసిడెంట్ అల్తాఫ్ మహమ్మద్, ఎండి జాఫర్, ఎండి చాంద్ భాషా, నవాజ్, జహీర్ గౌస్, ఎండి భాష, ఎండి గౌస్, ముస్లిం పెద్దలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఉచిత భోజనం ప్రారంభం

విశాలాంధ్ర - గోపాలపురం : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నిరంకుశ పాలనకు వైకాపా ఎమ్మెల్యేల క్రాస్ ఓటింగ్ నిదర్శనమని తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాలపురం మరియు నియోజకవర్గ అభ్యర్థి మద్దిపాటి వెంకటరాజు అన్నారు. శుక్రవారం అన్నా క్యాంటీన్ వద్ద తెదేపా సీనియర్ నాయకులు కొర్లపాటి అన్నవరం ఆర్థిక సహాయంతో ఏర్పాటుచేసిన ఉచిత భోజన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ముందుగా మండలి కి జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలలో ఎమ్మెల్యేల కోటాలో తెదేపా అభ్యర్థి పంచుమర్తి అనురాధ అనూహ్య విజయాన్ని పురస్కరించుకొని తెదేపా నాయకులు కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత పుట్టినరోజు వేడుకను శిబిరంలో తెదేపా మండల మహిళ నాయకురాలు ఆలపాటి దుర్గాభవాని ఆధ్వర్యంలో భారీకేక్ కట్ చేసి స్వీట్ పంచారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెంకటరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో సైకో, నియంత పాలన కొనసాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో దేవరపల్లి మండల పార్టీ అధ్యక్షుడు ఆంద్రు అనిల్,రొంగాల సత్యనారాయణ,యద్దనపూడి బ్రహ్మరాజు, వడ్లమూడి రమేష్, గోపాలపురం దేవరపల్లి నాయకులు పాల్గొన్నారు.

నిర్మలగిరి మేరీమాత పుణ్యక్షేత్రాన్ని సందర్శించిన వాటికన్ సిటీ రాయబారి



విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి మండలం గౌరీపట్నం నిర్మలగిరి మేరీమాత పుణ్యక్షేత్రాన్ని భారతదేశంలో వాటికన్ సిటీ రాయబారి లియో ఫోర్డ్ జెరెల్లి సందర్శించారు. ఏలూరు పీఠం నుండి ఆయన గౌరీపట్నం చేరుకోగానే ప్రత్యేక గుర్రపు బగ్గిపై రాయబారి లియోఫోర్డ్ జిరెల్లి ఏలూరు పీఠాధిపతి జయ రావు పొలిమేర ఊరేగింపుగా పూర్ణకుంభంతో నిర్మలగిరి దివ్య క్షేత్రానికి తీసుకొని వచ్చారు. అనంతరం లియోఫోర్డ్ జరెల్లి పీఠాధిపతి పొలిమేర జయ రావు ప్రధాన ఆలయ వద్దకు వెళ్లి ప్రత్యేక దివ్యబలి పూజలు నిర్వహించారు. అనంతరం ప్రధాన వేదిక వద్దకు చేరుకుని జ్యోతి ప్రజ్వలన చేసి మేరీమాతకు పూలదండలు వేసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాయబారి జిరెల్లి మాట్లాడుతూ నిర్మలగిరి మేరీమాత పుణ్యక్షేత్రాన్ని సందర్శించటం తనకు ఎంతో అనుభూతి కలిగిందని తెలిపారు. ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావు మాట్లాడుతూ 2000 సంవత్సరంలో ప్రధాన ఆలయం ప్రారంభోత్సవ కార్యక్రమానికి అప్పటి వాటికన్ సిటీ రాయబారి బల్థార్జాన్ వచ్చారని గుర్తు చేశారు. విజయవాడ పీఠాధిపతి జోసఫ్ రాజారావు తెలక తోలు గుంటూరు పీఠాధిపతి చిన్న బత్తుల బాహ్యయ్య భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. నిర్మగిరి క్షేత్రం డైరెక్టర్ ఫాదర్ జాన్ పీటర్ మాజీ డైరెక్టర్లు ఫాదర్ ఆరోను దిరిసిన కే రాయప్ప వివిధ క్షేత్రాల నుంచి వచ్చిన గురువులు క్రైస్తవ భక్తులు పాల్గొన్నారు.

దొంతికుర్రులో విద్యార్థులకు పెన్నుల పంపిణీ

విశాలాంధ్ర - కాట్రేనికోన : చదువుతో ఉన్నత శిఖరాలు అధిరోహించ వచ్చునని దొంతికుర్రు గ్రామ సర్పంచ్ గెద్దడి ఈశ్వరి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు దాత కొప్పిశెట్టి శ్రీనివాసరావు సమకూర్చిన పరీక్ష అట్టలు, పెన్నులను ఆమె శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాట్రేనికొన మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు కాశి హనుమంతురావు, విద్యాకమిటి చైర్మన్ కొప్పుశెట్టి మహాలక్ష్మి, వైఎస్ఆర్ సీపీ నాయకులు పాలెపు ధర్మారావు, గెద్దాడ వేంకటేశ్వర రావు, గ్రామ ఉప సర్పంచ్ యనమదల రామకృష్ణ, ప్రధానోపాధ్యాయులు వై. చంద్రశేఖర్, ఉపాధ్యాయులు నారాయణ, వేణు గోపాల్, ఎస్‌జి కృష్ణ, వర్మ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలతో భిక్షాటన చేయిస్తే కఠినచర్యలు

విశాలాంధ్ర - కాకినాడ : ఇటీవల కాకినాడ నగరంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో విచ్చలవిడిగా పిల్లలతో భిక్షాటన చేయిస్తున్న సంఘటనలు అధికంగా జరుగుతున్నాయి. స్త్రీశిశు సంక్షేమశాఖ, పోలీసుశాఖ, విద్యాశాఖ, చైల్డ్‌ఫండ్ ఇండియా ఆధ్వర్యంలో చైల్డ్ బెగ్గింగ్‌పై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో భిక్షాటన చేస్తున్న 21మంది బాలబాలికలను గుర్తించి వారిని జిల్లా బాలల పరిరక్షణ విభాగం కార్యాలయానికి తరలించారు. భిక్షాటన చేస్తున్నవారిని రక్షించడంతో పాటు ప్రభుత్వపరంగా ఉన్న విద్యావసతి సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని, పిల్లలతో భిక్షాటన చేయిస్తే ప్రభుత్వపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి, మహిళా శిశు అధికారిణి కె. ప్రవీణ హెచ్చరించారు. పిల్లలతో భిక్షాటనచేయిస్తే చట్టపరంగా చర్యలకు బాధ్యత వహిస్తామని వారి తల్లిదండ్రులవద్ద హామీ పత్రాన్ని తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీవో సీహెచ్ వెంకటరావు, సమగ్రశిక్ష కోఆర్డినేటర్ కె హరికృష్ణ, చైల్డ్‌ఫండ్ కోఆర్డినేటర్ లక్ష్మిపతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినిల వైద్యానికి యువత ఆర్థిక సాయం

విశాలాంధ్ర - కాట్రేనికోన : గుండె సమస్యతో బాధపడుతున్న కాట్రేనికోన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినిలు తిరుకోటి దివ్య, మల్లాడి వీరలక్ష్మిలకు చికిత్స నిమిత్తం కాట్రేనికోన పంచాయతీ రామస్వామి తోటకు చెందిన మోకా దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో పలువురు స్నేహితులు ఆర్థికంగా అండగా నిలిచారు. దుర్గాప్రసాద్ చొరవతో మంచి కోసం మేము సైతం హ్యూమానిటీ ఫోర్స్ పేరిట విదేశాలలో ఉన్న వారు పలుచోట్ల ఉన్న స్నేహితులంతా కలిసి సేకరించిన 40 వేలలో 30 వేల రూపాయల నగదును దివ్యకు, పదివేల రూపాయల నగదును వీరలక్ష్మికి అందజేశారు. దివ్య కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం తిరుపతిలో ఉండడంతో ఆ నగదును పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎన్.వెంకటేశ్వరరావుకు శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాకే దానియేలు, నవుడురి సుధాకర్, ఉరం సూర్యారావు, గంటి ఆనంద రావు, పాము స్వామి ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పలు సమస్యలు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - అనపర్తి : రైతులకు మేలు చేయాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి వాటి ద్వారా అన్ని పంటలు కొనుగోలు చేయనున్నట్టు ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. శుక్రవారం అసెంబ్లీ సమావేశంలో ఎమ్మెల్యే సత్తి మాట్లాడుతూ పంటల కొనుగోలు విషయంలో రైతులు ఎదుర్కొంటున్న కొన్ని కొన్ని ఇబ్బందులు అదే విధంగా పెదపూడి మండలం లో ఆర్బికెల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యాన్ని సమీపంలో ఉన్న బిక్కవోలు లేదా అనపర్తి రైస్ మిల్లులకు రవాణా చేసినట్లయితే ప్రభుత్వానికి, రైతుకు ఉపయోగకరంగా ఉంటుందని సభ దృష్టికి తీసుకువచ్చారు. జగనన్న భూ సర్వే లో భూ యజమానులే ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు పలు సమస్యలను సభ ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. అనపర్తి ప్రభుత్వ ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అప్ గ్రేడ్ చేసిన సీఎం జగన్ కు ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

టీడీపీ వేడుకలు

విశాలాంధ్ర-దేవరపల్లి : శాసనమండలి ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తరఫున పంచుమర్తి అనురాధ విజయం సాధించిన సందర్భంగా దేవరపల్లి మండలం సంగాయిగూడెంలో వేడుకలు నిర్వహించారు. మండల టీడీపీ అధ్యక్షుడు ఆంద్రు అనిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గోపాలపురం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి మద్దిపాటి వెంకటరాజు కేక్ కట్ చేసి పార్టీ నాయకులకు, కార్యకర్తలు అందజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విజయం 2024 అసెంబ్లీ ఎన్నికలకు తెలుగుదేశం పార్టీ విజయానికి దోహదపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు యద్దనపూడి రవీంద్ర, మాజీ సర్పంచ్ కుసులూరి శ్రీను, దంపన పోయిన బ్రహ్మరాజు, ఉప్పులూరి రాంబాబు, గ్రామానికి చెందిన దేశం నేతలు పాల్గొన్నారు. అంతకుముందు ఎన్టీ రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

విశాలాంధ్ర గోదావరి జిల్లా
కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

జాతీయ స్కాలర్‌షిప్‌కు కాట్రేనికోన విద్యార్థులు

ఉపాధ్యాయుడు హేమ కృషికి అభినందనలు

విశాలాంధ్ర - కాట్రేనికోన : కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా పేద విద్యార్థులకు ఆర్థిక చేయూతనిచ్చి ఉన్నత చదువులు కొనసాగించదానికి ఉద్దేశించిన నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్ షిప్ (ఎన్ఎంఎంఎస్)కు కాట్రేనికోన మండలం నుండి 14 మంది విద్యార్థినీ విద్యార్థులు ఎంపిక య్యారు. వీరిలో పదిమంది విద్యార్థులు కాట్రేనికోన శ్రీ వరాహ బొట్ల మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన వారే ఈ పోటీపరీక్షలో ఎంపిక కావడం విశేషం. చెయ్యేరు, దొంతి కుర్రు, లక్ష్మీవాడ, గచ్చకాయలపొర ఉన్నత పాఠశాలలో ఒక్కొక్కరు చొప్పున ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికయ్యారు. ఈ స్కాలర్ షిప్ పథకంలో ఒక్కో విద్యార్థికి ఏడాదికి 12,000లు చొప్పున నాలుగు సంవత్సరాలు పాటు ఉన్నత విద్య కొనసాగించేందుకు కేంద్ర ప్రభుత్వం అందిస్తుంది. కాట్రేనికోన ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న సైన్స్ ఉపాధ్యాయుడు లంకే హేమ శ్రీనివాసరావు ప్రతి ఏటా ప్రత్యేక శ్రద్ధ తీసుకుని విద్యార్థులకు పోటీపరీక్షలపై శిక్షణ ఇస్తున్నారు. గత ఏడాది ఇదే పాఠశాలలో ముగ్గురు విద్యార్థులు ఎంపిక కాగా ప్రస్తుత ఏడాది ఏకంగా పదిమంది ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికై రికార్డు సృష్టించారు. శ్రీనివాసరావు కృషిని స్థానికులు అభినందిస్తున్నారు. విజేతలైన విద్యార్థులను, ప్రత్యేక శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయుడు శ్రీనివాసరావును అభినందించారు.

చంద్రశేఖర్‌కు ఎస్పీ అభినందనలు

విశాలాంధ్ర - కాకినాడ : భారత ప్రభుత్వంచే 2023 సంవత్సరానికి గాను ప్రకటించిన పద్మశ్రీ అవార్డును రాష్ట్రపతి చేతులమీదుగా స్వీకరించిన కాకినాడకు చెందిన సంకురాత్రి ఫౌండేషన్స్ చైర్మన్, సంఘ సేవకులు ప్రముఖ చంద్రశేఖర్ సంకురాత్రిని శుక్రవారం కాకినాడ జిల్లా ఎస్పీ ఎం రవీంద్రనాథ్ బాబు కొత్తూరు గ్రామంలో ఉన్న కిరణ్ కంటి ఆసుపత్రి వద్ద మర్యాదపూర్వంగా కలిసి, దుశ్శాలువాతో సత్కరించి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సంకురాత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాఠశాలలో చదువుతున్న పిల్లలతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీతో పాటు కాకినాడ ఎస్‌డిపిఓ పి.మురళీకృష్ణ రెడ్డి, సర్పవరం ఇన్‌స్పెక్టర్ ఆకుల మురళీకృష్ణ, టూటౌన్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జగన్ ప్రభుత్వాన్ని ఛీకొడుతున్న పాలకవర్గ నేతలు

విశాలాంధ్ర - కాకినాడ : జగన్ ప్రభుత్వాన్ని పట్టభద్రులే కాదు పాలకవర్గనేతలూ ఛీకొట్టారనే విషయం ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా పంచుమర్తి అనురాధ విజయంతో తేట తెల్లం అయ్యిందని మాజీ మేయర్, కాకినాడ జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు సుంకర పావని అన్నారు. ఎమ్మెల్యే కోటాలో కూడా ఎమ్మెల్సీగా తెదేపా అభ్యర్థి గెలుపొందింది అంటే జగన్ పాలన పట్ల పట్టభద్రులు కాకుండా సొంత పార్టీ నేతలే అసంతృప్తితో ఉన్నారనే విషయం అర్థమవుతోందన్నారు. ఇక 2024లో రానున్న సాధారణ ఎన్నికలలో జగన్‌ను వైసీపీ ప్రభుత్వాన్ని ఛీ కొట్టడం సాధారణ పౌరుల వంతు అవుతుందని వైసీపీ నాయకులందరూ ప్రజల చేతిలో ఓడిపోవడానికి సిద్ధంగా ఉండాలని అన్నారు.

క్షయవ్యాధిగ్రస్తులకు చేయూత

విశాలాంధ్ర - అంబాజీపేట : మండలంలోని పుల్లేటికుర్రు గ్రామంలో రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వరల్డ్ టిబి డే ఘనంగా నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో భాగంగా పుల్లేటికుర్రు గ్రామపంచాయతీలో ఐదుగురు టిబి వ్యాధిగ్రస్తులను ఈ సంస్థ దత్తత తీసుకొని, వారికి ప్రతినెల చేయూత ఇచ్చేందుకు శ్రీకారం చుట్టారు. టిబి డే సందర్భంగా గ్రామ పంచాయతీ నుండి అవగాహన ర్యాలీ తరువాత మానవహారం నిర్వహించారు. సర్పంచ్ జల్లి బాలరాజు, ఎంపిటిసి పబ్బినీడి రాంబాబు, తెదేపా జిల్లా అధికార ప్రతినిధి దాసరి వీర వెంకట సత్యనారాయణ చేతుల మీదుగా ఐదుగురు టీబీ వ్యాధిగ్రస్తులకు కాయగూరలు, పండ్లు, గుడ్లు, కిరాణా సరుకులు అందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ యు. సురేష్, సెక్రటరీ వి. త్రిమూర్తులు, యు. ప్రసన్న సభ్యులు సుధాకర్, శ్రీనివాస్, రామకృష్ణ, పండు, ఏసుబాబు, ప్రసాద్, గణపతి, పీహెచ్సీ సూపర్వైజర్లు జి. సర్వారాయుడు, ఎం. వెంకటేశ్వరరావు, ఎ.ప్రసాద్, కె. అరుణ, కె. పావని, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి మండల పరిషత్ నిధులు

విశాలాంధ్ర - పి గన్నవరం : గ్రామాల అభివృద్ధికి మండల పరిషత్ నిధులను కేటాయించి అభివృద్ధి చేయనున్నట్టు పి గన్నవరం మండల పరిషత్ అధ్యక్షురాలు అంబటి భూలక్ష్మి కోటేశ్వరరావు అన్నారు. ఈ మేరకు పి గన్నవరం మండల పరిషత్ కార్యాలయం వద్ద నూతనంగా చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు, పి గన్నవరం గ్రామంలోని భవాని కాలనీ వద్ద నూతనంగా నిర్మించనున్న డ్రైనేజీ నిర్మాణ పనులకు ఎంపీపీ భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొండాడ నాగమణి, వైస్ ఎంపీపీ నేలపూడి దామోదర్, ఎంపీటీసీలు పులపర్తి చిన్న వెంకటలక్ష్మి, కొక్కిరి లక్ష్మి, టిడిపి నాయకులు సంసాని పెద్దిరాజు, ముసిని వెంకటేష్, రుద్ర గంగారావు, పరమట సత్యనారాయణ, పెచ్చెట్టి ఈశ్వరరావు, పెదపూడి దుర్గాదేవి, పెదపూడి రాము, సంసాని నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పి గన్నవరంలో టీడీపీ నాయకుల వేడుకలు

విశాలాంధ్ర - పి గన్నవరం : ఎమ్మెల్యే కోటాలో నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికలలో టిడిపి ఎమ్మెల్సీ అభ్యర్థి పంచుమర్తి అనురాధ విజయం సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ పి గన్నవరం మూడు రోడ్ల కూడలిలో తెలుగుదేశం పార్టీ నాయకులు శుక్రవారం వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్ బాబు పాల్గొని టిడిపి నేతలతో కలిసి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అభిమానులు ఏర్పాటు చేసిన కేక్‌ను ఆయన కట్ చేసి టిడిపి నాయకులకు పంచారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అంబటి భూలక్ష్మి కోటేశ్వరరావు, వైస్ ఎంపీపీ నేలపూడి దామోదర్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి స్కాలర్‌షిప్‌కు ముమ్మిడివరం విద్యార్థులు

విశాలాంధ్ర - ముమ్మిడివరం : ముమ్మిడివరం బాలికల ఉన్నత పాఠశాల నుండి ఎన్ఎంఎంఎస్ పరీక్షలో ఐదుగురు విద్యార్థినులు స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారు. విద్యార్థులు జంగం అనూష, ఇళ్ల హేమశ్రీ, పంతగడి సుష్మాశ్రీ, మాగాపు ప్రవల్లిక, తరణి భువనేశ్వరి విజయం సాధించారు. వీరిని మండల విద్యాశాఖ అధికారి బొజ్జ రమణశ్రీ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వంగా శ్రీనివాసరావు, సైన్స్ టీచర్ బెహరా సత్యనారాయణమూర్తి, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ పంతగడి కృష్ణంరాజు అభినందించారు.

అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నాం

విశాలాంధ్ర -భీమవరం టౌన్ : అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. భీమవరం మండలంలోని కొత్త పూసల మర్రు గ్రామంలో రూ. 25 లక్షలతో నిర్మిస్తున్న గ్రామపంచాయతీ భవనానికి శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకప్రక్క అభివృద్ధి, మరో ప్రక్క సంక్షేమం దిశగా ముఖ్యమంత్రి జగన్ పని చేస్తున్నారని తెలిపారు. ప్రజల కోరిక మేరకు పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు నియోజకవర్గంలో జరుగుతున్నాయని తెలిపారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళ్తున్నామన్నారు. నాడు నేడు పథకంలో ప్రతి ప్రభుత్వ పాఠశాలను కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా అభివృద్ధి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్ పిల్లలకు అండగా ఉన్నారన్నారు. భీమవరం నియోజకవర్గంలో ప్రజల ఆరోగ్యానికి భద్రత కల్పించే విధంగా 100 పడకల ఆసుపత్రిని మంజూరు చేయించడమే కాకుండా ఆసుపత్రి నిర్మాణాన్ని కూడా చేపట్టారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జల్లా కొండయ్య, ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహారాజు, జెడ్పీటీసీ కాండ్రేగుల నరసింహారావు, ఏఎంసీ మాజీ చైర్మన్ తిరుమాని ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

విశాలాంధ్ర-పాలకోడేరు: పరిసరాలు మనం పరిశుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరిచేరవు, అందరికీ మంచి ఆరోగ్యం ఉంటేనే అభివృద్ధి బాగుంటుందని కలెక్టరు పి.ప్రశాంతి అన్నారు. శుక్రవారం పాలకోడేరు మండలం విస్సాకోడేరు గ్రామంలో ఘన వ్యర్థ పదార్థాలు నుండి సంపద తయారు చేసే కేంద్రాన్ని నిశితంగా పరిశీలించి అధికారులకు ,సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. 4 రోజుల శిక్షణ కార్యక్రమంలో రోజుకి 3 మండలాలు,6 గ్రామ పంచాయితీలకు శిక్షణ ఇవ్వనుండగా మొదటి రోజు జిల్లా కలెక్టరు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఘన వ్యర్థ పదార్థాలు నుండి సంపద తయారు చేయు కేంద్రాలు బాగా పనిచేసి మంచి ఫలితాలు సాధించి,ఆదర్శ కేంద్రంగా తీర్చి దిద్దాలన్నారు. శానిటేషన్ పై స్పెషల్ డ్రైవ్ చేపట్టి ఎప్పటికప్పుడు పేరుకున్న చెత్తను తొలగించడంతో పాటు డ్రైనేజీలో పూడిక తీయాలన్నారు. తడి పొడి చెత్తను వేరు చేయటం పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ శాఖ అధికారి యం.నాగలత, మండల ప్రత్యేక అధికారి రమణ,తహశీల్దారు షేక్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ ఉపవాస ప్రార్థనలు ప్రారంభం

విశాలాంధ్ర - గణపవరం: రంజాన్ పండుగ పురస్కరించుకుని ముస్లింలు భక్తిశ్రద్ధలతో శుక్రవారం నుండి 30(నెల) రోజుల వరకు ఉపవాస ప్రార్థనలు ఉంటాయని గణపవరం మసీద్ పెద్ద గురువు అర్మన్ అన్సారి, చిన్న గురువు ఫరూఖ్ లు తెలిపారు. ఈ నెల రోజులు పాటు ముస్లింలు ఉపవాసాలు ఉండి మసీదులో ప్రార్థన చేసుకొని రంజాన్ రోజు పండుగ చేసుకుంటామని తెలిపారు .ఈ కార్యక్రమంలో మసీదు పెద్దలు షేక్ ఇస్మాయిల్, ఖాదర్ ఖాన్, రహమతుల్లా, నాగూర్, బహద్దుర్, షేక్ బషీరుద్దీన్, జాని, ముస్లింలు సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దివంగత జివిఆర్ జయంతి

విశాలాంధ్ర -భీమవరంటౌన్ : మున్సిపల్ మాజీ చైర్మన్, వైసీపీ సీనియర్ నాయకులు దివంగత గ్రంధి వెంకటేశ్వరరావు (జివిఆర్) జయంతి వేడుకలు స్థానిక పార్టీ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఘనంగా జరిగాయి. ముందుగా జీవిఆర్ చిత్రపటానికి ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్, ఆయన తనయుడు రవితేజలు పూలమాలలతో ఘన నివాళులర్పించారు. అనంతరం కేకులు కట్ చేసి పార్టీ నాయకులకు, కార్యకర్తలకు పంపిణీ చేశారు. తదనంతరం ఆటో డ్రైవర్లకు దుస్తులను పంపిణీ చేశారు. అనంతరం గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ రాజకీయాలలో ముక్కుసూటిగా వ్యవహరించి తనదైన శైలిలో భీమవరం పట్టణాన్ని పెద్ద ఎత్తున అభివృద్ధి చేశారని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ కోటిపల్లి బాబు, ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహారాజు, జెడ్పీటీసీ కాండ్రేగుల నరసింహారావు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామన నాగేశ్వరరావు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కోడె యుగంధర్, టౌన్ కన్వీనర్ తోట భోగయ్య , జె సిఎస్ కన్వీనర్‌లు నల్లం రాంబాబు, కోమటి రాంబాబు, గాదిరాజు సుబ్రహ్మణ్యం రాజు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.ఎస్ రాజు, మాజీ కౌన్సిలర్‌లు కానుబోయిన వెంకటరమణ, పాలవెల్లి మంగా, కొల్లి ప్రసాద్, పేరిచర్ల సత్యనారాయణ రాజు, చెల్లబోయిన సూర్య ప్రకాష్, మానుకొండ ప్రదీప్, పోలిశెట్టి దాసు, చికిలే మంగతాయారు, గంటా సుందర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 5న చలో ఢిల్లీ జయప్రదం చేయండి

విశాలాంధ్ర - కలిదిండి: కేంద్ర ప్రభుత్వ కార్మిక రైతాంగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 5న కార్మిక రైతాంగ సంఘాల ఆధ్వర్యంలో లక్షలాది మందితో నిర్వహిస్తున్న చలో ఢిల్లీ పార్లమెంట్ మార్చ్‌ను జయప్రదం చేయాలని సిఐటియు ఏలూరు జిల్లా కార్యదర్శి డి ఎన్ వి డి. ప్రసాద్ తెలిపారు. శుక్రవారం కలిదిండి లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చలో ఢిల్లీ గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ సంపదను అదాని అంబానీ కార్పొరేట్లకు దోచిపెడుతున్నరని తెలిపారు. మోడీ ప్రభుత్వం సంపద సృష్టికర్తలైన కార్మికులు రైతాంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టివేస్తూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక అప్పుల పాలవుతున్నారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను గ్రామాలలో కరపత్రాల పంపిణీ ద్వారా ప్రచారం చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు శేషపు. మహంకాళి రావు, జక్కుల. మహేష్, పెరుమాళ్ళ. సత్యనారాయణ, ఏ. వెంకటేశ్వరరావు, రైతు సంఘం నాయకులు వీరవల్లి. భాస్కరరావు, గంటా. రఘురాం ప్రసాద్, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీబైరాగి మఠంలో సీతారాముల కళ్యాణ మహోత్సవం

విశాలాంధ్ర -పెంటపాడు: మండలంలో కస్పా పెంటపాడు గ్రామంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో శ్రీబైరాగి మఠంలో శ్రీసీతా రాముల కల్యాణ మహోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నామని కార్యనిర్వహణాధికారి చీమల కొండ సాయి తెలిపారు. శుక్రవారం ఆలయ ప్రాంగణంలో ఆయన విలేకరులతో బైరాగి మఠంలో శ్రీరామనవమి పురస్కరించుకుని ఏప్రిల్ రెండో తేదీ వరకు అత్యంత వైభవంగా ఉత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతిరోజు సాంస్కృతిక జానపద కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రత్యేకంగా ఈనెల 30 న శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణ మహోత్సవం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ పాల్గొంటారని తెలిపారు. అదే రోజున అఖండ అన్న సమారాధన ఉంటుందన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చలువ పందిర్లు, మంచినీటి సదుపాయంతో పాటు మౌలిక వసతులు ఏర్పాటు చేశామని తెలిపారు.

ఇంటింటికి ఛలో ఢిల్లీ కరపత్రాలు

విశాలాంధ్ర-ఉంగుటూరు: కేంద్రప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టడానికై ఏప్రిల్ 5 న జరిగే ఛలో ఢిల్లీ కార్యక్రమంలో కార్మిక - కర్షకులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి కొక్కిరిపాటి వెంకట్రావు పిలుపు నిచ్చారు. ఈ మేరకు శుక్రవారం సిఐటియు ఆధ్వర్యంలో ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేశారు.500 ఇళ్లను కలిసి కరపత్రాలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు కోండ్రు చిన్నఅంజయ్య,కె.అశోక్,పెండెం ప్రసాదరావు,కె.వెంకట్రావు,కె.మారియ్య తదితరులు పాల్గొన్నారు.

క్షయ రహిత జిల్లాగా అడుగులు వేయాలి

జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి

విశాలాంధ్ర -భీమవరం : క్షయ వ్యాధి రహిత జిల్లాగా అడుగులు వేసి క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించాలని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి సూచించారు.శుక్రవారం స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని స్పందన సమావేశంలో ప్రపంచ టిబి దినోత్సవం సందర్భంగా నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా నుంచి టీబీ వ్యాధిని పారద్రోలి టీబీ వ్యాధి రహిత జిల్లా దిశగా అడుగులు వేయడం లో ప్రజల మద్దతు, భాగస్వామ్యం అవ్వాల్సి ఉందని జిల్లా కలెక్టర్ అన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, టీబీ వ్యాధిగ్రస్తులు ఎవ్వరు భయాందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. టీబీ లక్షణాలు ఉన్నవాళ్లు డాక్టర్ వద్దకు వెళ్ళి తగిన వైద్య చికిత్స, డాక్టర్ సలహా మేరకు ఆహారం తీసుకోవడం ద్వారా పూర్తి ఆరోగ్యవంతులు అవ్వవచ్చు అన్నారు. 2025 నాటికి జిల్లాలో టీబీ వ్యాధిని 100 శాతం లేకుండా చేయాలని కలెక్టర్ సూచించారు. టెస్టులు బాగా పెంచాలని కలెక్టర్ అన్నారు. ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ ఎం. సూర్య తేజ మాట్లాడుతూ టీబి అనేది గుర్తించి సరైన వైద్యం చేయించుకున్నట్లయితే నూటికి నూరు శాతం నిర్మూలన అవుతుందన్నారు.ఈ వ్యాధికి ఎవరు భయపడవలసిన అవసరం లేదన్నారు.జిల్లా రెవెన్యూ అధికారి కె. కృష్ణవేణి మాట్లాడుతూ పొలియోకి వ్యాక్సిన్ వేసి పూర్తిగా లేకుండా చేసామని, టీబి వ్యాధికి సైతం వైద్యం ఉందని అన్నారు.

మన జిల్లా లో ఎన్జీ వోలు, వైద్య సిబ్బంది, ప్రభుత్వ అధికారులు సమన్వయంతో పనిచేసి టీబీ వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలని సూచించారు. వైద్యశాఖలో పని చేసిన సిబ్బందికి , వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు సర్టిఫికెట్లను , మెమొంటోలను ప్రధానం చేశారు. టీబీ వ్యాధి నిర్మూలనకు సంబంధించిన మూడు రకాల పోస్టర్లను ఆవిష్కరించారు.

జిల్లాలో టీబీ వ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్లను కలెక్టర్ అందించారు.ఈ కార్యక్రమంలో డి ఎం హెచ్ ఓ డాక్టర్ మహేశ్వర రావు , జిల్లా క్షయ వ్యాధి నివారణ అధికారి డాక్టర్ బి. భాను నాయక్ , వైద్యశాఖ అధికారులు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహం ఉరకలేసిన వేళ... యువత కేరింత

శ్రీవాసవిలో సందడిగా సాగుతున్న టెక్- యుఫోరియా2కె23

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం: శ్రీవాసవి ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ప్రారంభమైన మూడు రోజుల సాంకేతిక సింపోజియం రెండవ రోజు అద్యంతం విద్యార్థుల ఉల్లాస ఉత్సాహాల మధ్య సందడిగా సాగింది. రెండవ రోజు కార్యక్రమాలలో భాగంగా కొన్ని విభాగాలలో ప్రాజెక్ట్ ఎక్స్పో, మీలో ఎవరు జీనియస్, స్పాట్ ఫోటోగ్రఫీ , షార్ట్ ఫిల్మ్ మేకింగ్, యాడ్ మేకింగ్, కవిత్వం, కళా ప్రదర్శన, క్యాప్చర్ ద యుఫోరియా తదితర అంశాల్లో పోటీలను నిర్వహించారు. సాయంత్రం వరకు వివిధ విభాగాలలో జరిగిన పోటీలలో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలలో తమ కేరింతలతో సందడి చేసారు. కళాశాల పాలక వర్గ అధ్యక్ష, కార్యదర్శులు గ్రంథి సత్యనారాయణ, చలంచర్ల సుబ్బారావులు మాట్లాడుతూ దాదాపు 25కు పైగా కళాశాలల నుండి 1800 మంది విద్యార్థులు సాంకేతికోత్సవ పండుగలో పాల్గొనడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తోందన్నారు. విద్యార్థులు సృజనాత్మక ఆలోచనలకు ఆధునిక సాంకేతికతను జోడించి అద్భుత ఆవిష్కరణల దిశగా అడుగులు వేయాలని సూచించారు. కో ఆర్డినేటర్ డాక్టర్ రాంబాబు పాల్గొన్నారు. విద్యార్థినీ, విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.

టీడీపీ సంబరాలు

విశాలాంధ్ర-టి నరసాపురం : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయం సాధిస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జయ్యవరపు శ్రీ రామమూర్తి తెలిపారు. రాష్ట్రంలో జరిగిన ఎంఎల్‌సి ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ నాలుగు ఎంఎల్‌సి స్థానాల్లో విజయం సాధించిన నేపథ్యంలో మండల టీడీపీ ఆద్వర్యంలో శుక్రవారం మండల కేంద్రమైన టి. నరసాపురం ప్రధాన సెంటర్లో ఎన్టీఆర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం టిడిపి జెండా ఆవిష్కరించి, టపాసులు కాల్చి, కేకు కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరామమూర్తి మాట్లాడుతూ జగన్ సైకో పాలనకు పట్టభద్రులు, ఎంఎల్‌ఏలు గట్టిగా బుద్ధి చెప్పారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పిన్నమనేని మధు, బొంతు సత్యనారా యణ, పెద్దిన సత్యనారాయణ, ఆచంట అనిల్, జోను బోయిన సోంబాబు, మండం ఆదిత్య కుమార్, భీమవరపు జగన్మోహనరావు, నాళం కాశీ, ఘంటా సతీష్, కొండపల్లి రవి, కొల్లి రమేష్, సందేపూడి సాయి, దేవరపల్లి రంగారావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని కలుసుకున్న వైసీపీ నేత గోపి

విశాలాంధ్ర-ఉంగుటూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైసీపీ అనుబంధ సంస్థ చైర్మన్, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర రెడ్డిని ఏలూరు జిల్లా వైసీపీ పంచాయతీ రాజ్ సెల్ అధ్యక్షులు పుప్పాల గోపి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ విషయాన్ని శుక్రవారం ఉంగుటూరులో విలేకరులకు తెలిపారు. పార్టీ విజయం కోసం అనుబంధ సంస్థలు కష్టపడి పని చేయాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా గోపి భాస్కర్ రెడ్డిని శాలువా కప్పి సన్మానించారు.

ప్రతి ఒక్కరూ పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం మండలం తాళ్ళపాలెం గ్రామంలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆరోగ్య సహాయకుడు నామాల రాజు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత మన అందరి బాధ్యత అన్నారు. దోమ కాటుకు గురి కాకుండా దోమ తెరలు వాడాలని, ఇంటి చుట్టూ నీరు నిల్వ లేకుండా చూడాలని అన్నారు.దోమలను నిర్మూలించాలని ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రం గా ఉంచుకోవాలని ప్రతి గృహంవద్ద వారంలో ఒకరోజు పొడివాతా వరణం పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమములో ఎం ఎల్ హెచ్ పి గోపీనాథ్, ఆశా కార్య కర్తలు భాగ్యం, జయమ్మ వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఎమ్మెల్సీ విజయం పట్ల హర్షం

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : రాష్ట్రంలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి తరఫున పోటీకి దిగిన పంచుమర్తి అనురాధ 23 ఓట్లు మెజార్టీతో గెలుపొందడం హర్షించదగ్గ విషయమని టిడిపి పోలవరం నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు మొడియం శ్రీనివాసరావు తెలిపారు. వైసీపీ ప్రభుత్వం గద్దె దిగడానికి సమయం దగ్గర పడిందని, ప్రజా నాడి తిరగబడిందన్నారు.రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం విజయకేతనం ఎగరవేస్తుందని ముఖ్యమంత్రిగా తిరిగి చంద్రబాబు రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందుతారని శ్రీనివాసరావు పేర్కొన్నారు.

రానున్న అసెంబ్లీ ఎన్నికలలో టీడీపీ విజయఢంకా

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపి విజయం సాధిస్తుందని చెప్పడానికి నిదర్శనం ఎమ్మెల్సీ పోటీలలో గెలుపొందిన టిడిపి ఎమ్మెల్సీలు అని పార్టీ నాయ కులు పేర్కొన్నారు. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి తరఫున పోటీ చేసిన పంచుమర్తి అనురాధ 23 ఓట్ల మెజారిటీతో గెలుపొందడం హర్షించదగ్గ విషయమని కొయ్యలగూడెంలో ప్రధాన సెంటర్లో ఉన్న వినాయకుని ఆలయం వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎన్టీఆర్ విగ్రహానికి ముందుగా పూలమాలలు వేసి, అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో పోలవరం నియోజవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బొరగం శ్రీనివాసరావు మండల అధ్యక్షుడు పారేపల్లి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

శుభకృతు,శోభకృతు' తో టీడీపీ విజయానికి నాంది

- విజయోత్సవ ర్యాలీలో తెలుగు తమ్ముళ్లు

విశాలాంధ్ర - రాజానగరం : గడిచిన శుభకృతు, ప్రస్తుత శోభకృతు సంవత్సరాలు తెలుగుదేశం పార్టీకి శుభాలు చేకూర్చి, టీడీపీ విజయానికి నాంది పలికాయని నియోజక వర్గ మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్ అన్నారు.ఇటీవలే టీడీపీ కైవసం చేసుకున్న మూడు పట్టభద్రుల ఎమ్మెల్సీ

విజయాలతో పాటు మొన్న సాధించిన ఒక శాసనసభ ఎమ్మెల్సీ విజయాన్ని పురస్కరించుకుని మండలంలో తెలుగుదేశం ఆధ్వర్యంలో శుక్రవారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు.దీనిలో భాగంగా స్థానిక సూర్యారావు పేట లోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిం చారు. అలాగే అక్కడ నుండి స్థానిక బస్టాండ్,గాంధీ బొమ్మ కూడలి,ఏడిబి రోడ్డు వరకు బైక్ ర్యాలీ జరిపారు. అనంతరం విశాలాంధ్రతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ విధానాలు,తీరుతో విసుగు చెందిన పట్టభద్రులు, శాసనస భ్యులు,టీడీపీ అధికారంలోకి రావాలని తెలుగుదేశానికి ఓట్లు వేశారన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలుపునకు ప్రతి ఒక్కరు మరింత కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తూర్పుగోదావరి జిల్లా పార్లమెంటు ఉపాధ్యక్షులు గంగిశెట్టి చంటిబాబు,పార్లమెంటు కార్యనిర్వాహక కార్యదర్శి కొల్లం రత్నం,పార్టీ అధికార ప్రతినిధి నూనె వెంకన్న, నాయకులు పాల్గొన్నారు.

మార్పు మొదలైంది... టీడీపీ విజయం తథ్యం

విశాలాంధ్ర -నిడదవోలు : జగన్ రాక్షస పాలన పై ప్రజలు విసుగు చెందారని, అదుపులేని ధరలతో ప్రజల్లో మార్పు మొదలైందని ఎన్నికలెప్పుడైనా టీడీపీకి విజయం తథ్యమని నిడదవోలు తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి బూరుగుపల్లి శేషారావు అన్నారు. నిడదవోలు మండలం సమిశ్రగూడెంలో ఇదేం ఖర్మ ఈ రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా రచ్చబండను శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శేషారావు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసీపీ డొల్లతనం బయటపడిందన్నారు.టీడీపీకి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా వున్నారన్నారు. ఈ సందర్భంగా స్థానికులనుండి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు శ్రీ వెలగన సూర్యారావు,ప్రధాన కార్యదర్శి పంచదార వెంకట దుర్గ ప్రసాద్, జిల్లా పార్టీ అధికార ప్రతినిధి బుగ్గే శివరామకృష్ణ,క్లస్టర్ ఇన్‌ఛార్జ్ జుజ్జవరపు గోపాలకృష్ణ,మండల, గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ విజయోత్సవం

విశాలాంధ్ర - కాకినాడ : స్థానిక సర్పవరం జంక్షన్ ఎన్టీఆర్ విగ్రహం వద్ద కాకినాడ రూరల్ టిడిపి అధ్యక్షులు సీతయ్య దొర అధ్యక్షతన ఎమ్మెల్సీ విజయోత్సవ వేడుకలను నాయకులు కార్యకర్తలు భాణాసంచా పేల్చి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముందుగా ముఖ్యఅతిథి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఆరోగ్య విభాగ కార్యనిర్వాహక కార్యదర్శి అలై డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం టిడిపి నాయకులు కార్యకర్తలమధ్య కేక్ కట్ చేసి అందరికీ పంచారు. ఈ సందర్భంగా డాక్టర్ చప్పిడి మాట్లాడుతూ శాసన సభ్యులచే ఎన్నుకోబడ్డ ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ విజయం చాలా ఆనందదాయకమని అన్నారు. అధికార పార్టీ శాసనసభ్యులు టిడిపికి మద్దతు ఇవ్వడం అధికార పార్టీ పతనానికి నాంది అని పేర్కొన్నారు. ఎస్సీ సెల్ నాయకులు కొల్లబత్తుల అప్పారావు మాట్లాడుతూ అధికార గర్వంతో చెలరేగుతున్న వైసిపి నాయకుల పతనం ఇంకొద్ది రోజుల్లోనే ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో కరప మండలం తెలుగుదేశం అధ్యక్షులు దేవు వెంకన్న, కాకినాడ రూరల్ మాజీ జెడ్పిటిసి కాకరపల్లి చలపతిరావు సత్యవతి, రాయుడు అనిల్, కొండా వినాయక్, వాసిరెడ్డి సత్యనారాయణ, గుబ్బల భాస్కరరావు, పురం సత్యప్రసాద్, అడపా వీరబాద్రరరావు, చోడిశెట్టి కృష్ణ, సంఘాని మహేష్, బొమ్మిడి తాతారావు మరియు అధిక సంఖ్యలో టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలు తెలుగు దేశం పార్టీని గెలిపిస్తారు

విశాలాంధ్ర- పోడూరు: రాష్ట్ర ప్రజలు రానున్న సార్వత్రిక ఎన్నికలలో టిడిపిని గెలిపిస్తారని ఇందుకు ఎమ్మెల్సీ ఎన్నికలలో తెలుగుదేశం సాధించిన విజయాలే నిదర్శనమని పోడూరు మండల టీడీపీ అధ్యక్షులు గొట్టుముక్కల సూర్యనారాయణ రాజు అన్నారు.ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలలో పంచుమర్తి అనురాధ విజయం సాధించిన సందర్భంగా టిడిపి మండల నాయకులు మట్టపర్రులో శుక్రవారం జరిపిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ఎమ్మెల్సీ ఎన్నికలలో విజయం పొందిన పంచుమర్తి అనురాధ గత 4 సంవత్సరాలుగా ఈ వైసీపీ ప్రభుత్వం పై ఏ విధంగా పోరాటం చేశారో ఈ రాష్ట్ర ప్రజలకు తెలుసన్నారు. 175 నియోజకవర్గాల్లో గెలుస్తామన్న జగన్మోహన్ రెడ్డికి ఈరోజు తన పులివెందులలోనే ఓడిపోతామని భయం వచ్చిందన్నారు. మాజీ జెడ్పీటీసీ బొక్కా నాగేశ్వరరావు , పార్టీ మండల నాయకులు దొమ్మేటి శ్రీను, దేవరపు దొరబాబు, ఎల్లమెల్లి వెంకటరావు, కేతా నాగరాజు, బొక్కా సూర్యనారాయణ, గుబ్బల శ్రీరామ్, తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ పై అనర్హత వేటు ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు

విశాలాంధ్ర-ఏలూరు: రాహుల్ గాంధీపై అనర్హత వేటు ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు అని ఏలూరు జిల్లా కాంగ్రెస్ ఇన్చార్జి రాజనాల రామ్మోహనరావు విమర్శించారు. శుక్రవారం స్థానిక జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమా వేశంలో రామ్మోహనరావు మాట్లాడుతూ 2019 కర్ణాటకలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో రాహుల్ గాంధీ ప్రసంగిస్తూ దేశంలో మోడీ ఇంటి పేరుతో చాలామంది దొంగలు తయారవుతున్నారని విమర్శ చేయగా అదే విషయాన్ని గుజరాత్లో తన అనుచరులతో డెఫినేషన్ సూట్ వేయడం జరిగిందన్నారు. కోర్టు తీర్పులో రాహుల్ గాంధీ ని రెండు సంవత్సరాలు కన్విక్షన్ ఇవ్వడం జరిగిందన్నారు. తదుపరి 30 రోజుల్లో అప్పీలు చేసుకోవడానికి సమయం ఇచ్చారని తెలిపారు. అనంతరం 24 గంటలు గడవకముందే రాహుల్ గాంధీ పై అనర్హతలు వేటు వేయడాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ అభిమానులు నాయకులు కార్యకర్తలు తీవ్రంగా పరిగణిస్తున్నారన్నారు.ఈ సమావేశంలో అధ్యక్షులు బ్లాక్ టు అధ్యక్షులు లంకా రామ్మోహన్రావు, జిల్లా కార్యదర్శి సి దండుపాలెం చంద్రశేఖర్, పట్టణ కార్యదర్శి సాదే బాబు, ప్రసాద్, ఎస్ వి సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రి వద్ద మద్యం షాపు వద్దు

విశాలాంధ్ర - నిడదవోలు :వైద్యం కోసం రోగులు వచ్చే ఆసుపత్రి వద్ద మద్యం షాపు వద్దని పట్టణ ప్రజల సంక్షేమ సంఘం అధ్యక్షులు జువ్వల రాంబాబు అన్నారు. తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు స్థానిక స్వాతి హాస్పిటల్స్ వద్ద నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ మద్యం దుకాణంకు అనుమతులు ఇవ్వటం అభ్యంతరకరం అని వెంటనే తొలగించాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. నిత్యం రద్దీగా ఉండే బస్ స్టాండ్ దగ్గర గల స్వాతి ఆసుపత్రి వద్ద మద్యం దుకాణం ఏర్పాటు చేయటానికి ఎక్సయిజ్ డిపార్ట్ మెంట్ వారికి బుద్ధి వుందా అని రాంబాబు ప్రశ్నించారు వెంటనే తొలగించకపోతే ప్రజలే తొలగిస్తారని హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు ఇచ్చిన ఎక్సయిజ్ అధికారులు పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నానీ ,లెనిన్ ,నాగేంద్ర ,పలువురు యువకులు పాల్గొన్నారు.

2025కు టీబీని నిర్మూలించాలి

విశాలాంధ్ర -కైకలూరు :ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా కైకలూరు ప్రాంతీయ ఆరోగ్య కేంద్రంలో కైకలూరు మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు అడవి వెంకట కృష్ణ మోహన్ ముఖ్య అతిథిగా పాల్గొని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025 కి టిబి ని భారత దేశం నుంచి నిర్మూలించాలనే లక్ష్యంలో భాగంగా వైద్య ఆరోగ్య సిబ్బంది కృషి చేయాలన్నారు. ముఖ్యంగా గాలి ద్వారా చాలా వేగంగా వ్యాపిస్తుంది కాబట్టి ప్రతి ఒక్కరు దీని నిర్మూలనలో భాగస్వాములు కావాలన్నారు. తొలుత రోగులకు పోషకాహార కిట్స్ అందించారు. ర్యాలీ సి.హెచ్.సి నుంచి గాంధీ బొమ్మలు సెంటర్ వరకుఅక్కడ నుంచి ఎన్ జి ఓ హోమ్ వరకు సాగింది. మస్జిద్ సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కైకలూరు గ్రామ సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి, మండల వైస్ ప్రెసిడెంట్ మొహమ్మద్ జహీర్ లేన్, సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షులు చెరుకువాడ బలరామరాజు, తామరకొల్లు సర్పంచ్ శివాజీ, మంగినేని రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా 'ఆశా' ఇంటర్వ్యూలు

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ఆశా కార్యకర్తల ఇంటర్వ్యూలు ప్రశాంతంగా జరిగాయి. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలోని అర్బన్, రూరల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఖాళీగా ఉన్న 34 ఆశా కార్యకర్తల నియామకానికి అర్హులైన వారి నుంచి దరఖాస్తులు కోరగా జిల్లా వ్యాప్తంగా 169 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తుదారుల అన్ని రకాల ధృవీకరణ పత్రాలు పూర్తి స్థాయిలో పరిశీలించి, జాబితాను ప్రకటించిన అనంతరం వీరిలో అర్హులైన వారిని ఎంపిక చేసే నిమిత్తం జిల్లా కలెక్టర్ వారి ఆదేశానుసారం శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ మండలాల నుంచి ఇంటర్వ్యూ కోసమని వచ్చిన అభ్యర్థులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా తగిన సౌకర్యాలు కల్పించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఆర్ రమేష్, కాకినాడ రెవెన్యూ డివిజనల్ అధికారి బివి రమణ ,స్త్రీ శిశు సంక్షేమ శాఖ జిల్లా ప్రాజెక్టు అధికారిణి కే ప్రవీణ ఇంటర్వ్యూలు నిర్వహించారు. అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తామని డీఎంహెచో డాక్టర్ ఆర్ రమేష్ తెలిపారు.

క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర - ఏలేశ్వరం : ప్రపంచ క్షయ నివారణా దినోత్సవం సందర్భంగా ఏలేశ్వరం సిహెచ్‌సి ప్రధాన వైద్యాధికారి జి. శైలజ ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆరోగ్య విస్తరణ అధికారి భాస్కరరావు పర్యవేక్షణలో ఏఎన్ఎంలు, ఆశాలు, ఎంఎల్‌హెచ్‌పిలు, వైద్య ఆరోగ్య సిబ్బందితో టీబీ నివారణ పై అవగాహన కల్పించేందుకు ఆసుపత్రి నుండి బాలాజీ చౌక్ వరకు దారి పొడవునా నినాదాలు ఇస్తూ ప్రజలకు అవగాహన కల్పించి బాలాజీ చౌక్ వద్ద మానవహారం నిర్వహించి, టిబి నివారణ కోసం ప్రతిజ్ఞ చేశారు. సమాజంలో ప్రతి ఒక్కరూ టిబి నివారణ చర్యలు తీసుకునేందుకు భాగస్వామ్యులు కావాలని భాస్కరరావు పిలుపునిచ్చారు. అనంతరం ఆసుపత్రిలో ప్రధాన మంత్రి టిబి ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా క్షయ వ్యాధి గ్రస్తులకు పౌష్టిక ఆహారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వ్యాధి గ్రస్తులకు అందించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ ఏలేశ్వరం టౌన్, మండలంలో క్షయ రోగులందరికి ఈ విధమైన పోషకాహారం ఆరు నెలల పాటు ఇచ్చేందుకు గత నెల నుండి ప్రారంభించినట్టు అధ్యక్షుడు అలమండ దుర్గా వెంకట ప్రసాద్ చెప్పారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు కోట శ్రీనివాస్ చక్రవర్తి, జ్యోతుల నాగ సత్య శ్రీనివాస్, తాళ్లూరి గొల్లజిరావు, మామిడిపాక సతీష్, సత్యనారాయణ (తుని టిబి యూనిట్ మెడికల్ ఆఫీసర్), వైద్యులు భార్గవ్ తేజ, చిన్నారావు, వైద్య ఆరోగ్య పరిరక్షకుడు ఎస్‌వి రమణ, సురేష్, వైద్య ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

చంద్రబాబు పాలనా దక్షత కోరుకుంటున్న వైకాపా ఎమ్మెల్యేలు

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండల కేంద్రంలో చంద్రబాబు పాలనా దక్షతను వైకాపా ఎమ్మెల్యే కూడా కోరుకుంటున్నారని కొత్తపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బండారు సత్యానందరావు అన్నారు. కొత్తపేట నియోజకవర్గం ఆత్రేయపురం మండలం రాజవరం గ్రామంలో ముళ్లపూడి భాస్కరరావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిని పంచుమర్తి అనురాధ విజయం సాధించడంతో ఏర్పాటు చేసిన కేక్‌ను సత్యానందరావు కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ముళ్ళపూడి భాస్కరరావు, తోటకూర సుబ్బరాజు,కరుటూరి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి లేని సమాజం అందరి బాధ్యత

విశాలాంధ్ర - కరప : ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం పురస్కరించుకొని కరప ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ శ్రీనివాస నాయక్ ఆధ్వర్యంలో క్షయ వ్యాధి నివారణ దినోత్సవం నిర్వహించారున. నిక్షయమిత్ర అనే పేరున అవగాహన సదస్సు ఏర్పాటు చేశామని, కరప పీహెచ్సీ సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించినట్టు శ్రీనివాస్ నాయక్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ టీబీ నియంత్రణకు డాట్ పద్ధతిని అవలంబించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ ఆశ, రాధాకృష్ణ, సత్యనారాయణమ్మ, వై. రత్నకుమారి, డేవిడ్, రమణమూర్తి, సూర్యనారాయణ, వివి చౌదరి తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ స్కాలర్ షిప్‌కు 9మంది విద్యార్థుల ఎంపిక

విశాలాంధ్ర - గొల్లప్రోలు : గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న 9 మంది విద్యార్థులు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ టెస్ట్‌లో అర్హత సాధించినట్లు శుక్రవారం పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు నూకరాజు మీడియాకు తెలిపారు. కాకినాడ జిల్లాలోనే ఒకే పాఠశాల నుంచి 9మంది ఎంపికైన ఏకైక పాఠశాలని తెలియజేశారు. అర్హత సాధించిన వీరికి నాలుగు సంవత్సరాలపాటు రూ.12,000 చొప్పున మొత్తం 48,000 రూపాయలు కేంద్ర ప్రభుత్వ స్కాలర్ షిప్ అందిస్తుందని తెలిపారు. వీరికి ఉపాధ్యాయులు శేషు బాబు, వీరాస్వామి శిక్షణను అందించారు. ఆ విద్యార్థులను మండల శాఖ, గ్రామ అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.